# ప్రేమ సరఫరా

హైదరాబాదులో అన్నీ వింతలూ చూశాం అనుకునేవాళ్ళు చూడని తమాషా వకటుంది. తెల్లవారు జామున నాలుగు గంటలకు భార్యలను (ఇంటిదగ్గర) వదిలివచ్చిన మొగుళ్ళు, భర్తలను (మంచం దగ్గర) వదిలి వచ్చిన పెళ్ళాలూ ఎదురు బొదురుగా లైనులో నిలబడి యుద్ధానికి సన్నద్ధమవటం చాలామంది చూసిఉండరు. వాళ్ళదగ్గర ఆయుధాలు ఏమీ ఉండవు. దేవుడిచ్చిన నోరు ఉండనే ఉంది. చేతిలో అయితే వాళ్ళ వాళ్ళ శక్త్యానుసారం జర్మను సిల్వరు, అసలు సిల్వరు, స్టీలుతో చేయబడిన గిన్నెలు మాత్రం ఉంటాయి. మిలిటరీలో చేర్చుకున్నవాళ్ళకి అధికారులు ఇచ్చే సర్టిఫికేటు లాంటి కార్డులు ఎడంచేత్తో పట్టుకుంటారు. ఇదంతా ఏమిటి - గొడవ అనుకునేరు! హైదరాబాదులో గవర్నమెంటు సరఫరా చేసే పాలకేంద్రాలలో చూసినా తెల్లవారు జామున కనపడే దృశ్యాలు ఇవే! పాత్రలకే ఈ పద్ధతి వచ్చింది. తెల్లవారు జామున వెచ్చగా దుప్పటిలో ముసుగుతన్ని పడుకున్న ప్రేమకి భర్తగారైన గోపాలం దుప్పటిలోనుంచే బయటకు చూసి పాలగిన్నె ఎక్కడ పెట్టావు? అంటూ బయటపడటం చాలా చికాకు కలిగిస్తుంది. అతను గదిలోనుంచి వంటింటి లోకి, వంటింటిలోనుంచి గదిలోకి మూడుసార్లు తిరిగి గిన్నె మంచంకోడు దగ్గరే ఉంచటం గమనించి 'ఇక్కడ పెట్టానని అనుకుంటే చెప్పరాదా!' అని విసుక్కుంటాడు. గోపాలం అలా తిరుగుతూంటే చూడటం పార్వతికి సరదా.

'చిన్నమాట,' అంటుంది పార్వతి.

'ఏమిటది,' తలుపు తియ్యబోతున్న గోపాలం ఒక్క అడుగు వెనక్కు వేస్తాడు.

'బిగ్గరగా చెప్పకూడదు. దగ్గరకు రండి,' అంటుంది పార్వతి. గోపాలం ప్రాణం పాలమీదనే ఉంటుంది. సూర్యోదయాత్పూర్వమే ఒక గుక్కెడు కాఫీ పడితేనేగాని ప్రాణం చేరుకోదు. ముందుగా పోతేనేగాని ఆ పాలు దొరకవు. ఇంతలోకి జెట్ విమానంలా చప్పుడు చేసుకుంటూ పాలకారు వచ్చేస్తుంది. గోపాలం గడబిడపడుతూ 'తొందరగా చెప్పు' అంటూ చికాకు పడతాడు.

'ఏం లేదు. ఆ లుంగీ సరిగ్గా కట్టుకుని పొండి... ఊడిపోగలదు.' అంటుంది పార్వతి నవ్వు ఆపుకుంటూ. గోపాలం గిన్నె డ్రాయరుమీద పెట్టి చొక్కా తగిలించుకుని, లుంగీ బిగించుకుని కనబడని చెప్పులకోసం వెతికి బయలుదేర బోతాడు. తలుపు దగ్గరకు వెళ్ళేటప్పటికి పార్వతి మళ్ళీ పిలుస్తుంది.

'మళ్ళీ ఏమిటి?' గోపాలం ముఖం విసుగు పూసుకుంటుంది.

'ప్రతిదానికీ విసుగయితే నేను చెప్పేదేమీ లేదులెండి.'

'సరే చెప్పు.'

'మీకు కోపం తగ్గలేదు.'

'తగ్గింది. చెప్పు.'

'కొంచెం చేతులు పట్టుకుంటే మంచం దిగుతాను. మీరు పాలు తెచ్చేటప్పటికి నేను కాఫీ డికాక్షను తీసిపెడతాను.'

'మంచం దిగటానికి నా సాయం కావాలేమిటి?'

'అన్నిటికీ మీసాయం కావలసిందే, అర్ధాంగి అంటే ఏమిటి?.. ప్లీజ్!'

గోపాలం పాలగిన్నె మళ్ళీ డ్రాయరుమీద పెట్టి చేతులు అందిస్తాడు. పార్వతి చేతు లందుకుని మంచంమీద నుంచి మెల్లిగా దిగి అతని చేతులు వదిలి మాలతీ లతలా అతన్నే అల్లుకుని పోతుంది.

'పాలు లేకపోతే పీడాపోయిరి. హోటలుకు పోయివద్దాం. ఈ చలిలో అక్కడి కెందుకు పోతారు.' అంటుంది పార్వతి. గోపాలం ఆమెను విడిపించుకు పోవాలని గింజుకుంటాడు. పార్వతి మరింత దగ్గరకు తీసుకుంటుంది అతన్ని.

'సరే నీ ఇష్టం,' అంటాడు గోపాలం.

'నా ఇష్టమేగాని, మీ కే ఇష్టాలూ, సరదాలూ - లేవన్నమాట... అంతేగదా. వెళ్ళండి...పోయి, అక్కడే కూర్చోండి! పార్వతి రుసరుసలాడుతూ అతన్ని వదిలేసి, వీధి తలుపు దభాలున తీసి పాలగిన్నె అతని చేతి కందించి తలుపు మళ్ళీ వేసి మంచంమీదకు చేరి దుప్పటి ముఖంమీదకు లాక్కుని కలలుకనటం ప్రారంభిస్తుంది. దుప్పటి సినిమా తెరలాగా అయిపోతుంది. దానిమీద ఎన్నో బొమ్మలు, తెలిసిన మనుష్యులు, ఏనుగులు, గుర్రాలు, గంధర్వులు - అందులో ఒక గంధర్వ కుమారుడు తనని పలకరిస్తాడు. 'నిన్ను వరించి వచ్చాను,' అంటాడు.

'నన్ను వరించట మేమిటి ఆసహ్యంగా! ఆ గోపాలం నా మెళ్ళో తాళి గట్టాడు - తెలియదా,' అంటుంది పార్వతి.

'ఇది భూలోకం. నేను దేవలోకం వాణ్ణి. పెళ్ళయిన వాళ్ళంటేనే నాకు ఇష్టం.' గంధర్వకుమారుడు దుప్పటి తెరమీదనుంచి ముందుకు రాబోతడు. పక్కన గోపాలం లేకపోవటం కొంతవరకు మంచిదయింది.

'మరి నువ్వొచ్చి భూలోకంలో ఉండిపోతావా?'.

'ఓ...' గంధర్వ కుమారుడు రథం దిగి బయలుదేరుతాడు. గోపాలం పాలు తెచ్చేదాకా గంధర్వకుమారుడితో కబుర్లు చెప్పుకోవచ్చు అనుకుంది పార్వతి.

'మరి నువ్వు తెల్లవారుజామున నన్ను వదిలేసి పాలకోసమని బయలుదేర కూడదు. ఆ షరతుకు వప్పుకుంటావా?'

'ఓ...'

'ఆఫీసు టయిమయిందనీ, ఆఫీసులో ఆలస్యంఅయిందనీ, అన్నం తినగానే నిద్ర వస్తోందనీ, అనకూడదు. అంగీకారమేనా!'

'అట్లాగే. నే నసలు ఉద్యోగమే చెయ్యను!'

'మనం ముసలివాళ్ళం అయేదాకా సరిపోయేటంత డబ్బు పట్టుకు రావాలి మరి!'

'మా దగ్గర డబ్బెక్కడిదీ?'

'డబ్బు లేకపోతే వక మణుగు బంగారం తీసుకుని రా. బంగారం ఇస్తే బోలెడంత డబ్బు వస్తుంది!'

'ఇప్పుడే మా నాన్నగారిని అడిగి బంగారం పట్టుకుని వచ్చేస్తాను!'

'ఆ సంగతే నాకు గిట్టదు. నాన్నగారితో చెప్పి ఆఫీసుకు పోవటం, అమ్మగారితో చెప్పి గదిలోకి రావటం నాకు గిట్టవు. నేను చెప్పినట్లు నువ్వు చెయ్యాలి. నువ్వు స్వతంత్రంగా బ్రతకగలగాలి!'

'సరే బంగారం ఎవరినీ అడక్కుండా పట్టుకుని వస్తానులే!'

'ఇంకో షరతు. వచ్చేటప్పుడు ఆ చమ్కీకోటులు, కిరీటాలు, ఈకలు అన్నీ తీసేసి రావాలి.'

'సరే...'

పార్వతి దుప్పటిముఖంమీదకు దగ్గరగా లాక్కుంటుంది. గంధర్వ కుమారుడి కళ్ళల్లోకి సూటిగా దగ్గరగా చూస్తుంది. గోపాలం పోలికలు కొద్దిగా కనిపిస్తాయి. గోపాలం కాదు ! అతనికి ఇంతధైర్యం ఎక్కడిది? అనుకుంటుంది పార్వతి. తలుపు చప్పుడు విని ఉలిక్కిపడింది.

తలుపు తీస్తావా?' గోపాలం బయటనుండి పిలుస్తున్నాడు. 'తీస్తావా?' అదేం ప్రశ్న. 'తలుపు తియ్యి' అని నిక్కచ్చిగా అడగ లేడూ. 'ఛీ. ఛీ.' అనుకుంటూ పార్వతి తలుపు తీస్తుంది. గోపాలం వచ్చి పాలు తీసుకుని సూటిగా వంటింటిలోకి ప్రయాణం అవుతాడు. గది లోపలకు రాగానే పాలగిన్నె డ్రాయరుమీద పెట్టేసి, తలుపు ఒక కాలుతో దగ్గరగా తోసేసి తననుదగ్గరగా తీసుకోలేదని పార్వతి మండిపడుతుంది. 'తనని దగ్గరగా తీసుకుని గుండెలకు హత్తుకోలేని ఆ చేతులెందుకు? పాలగిన్నె పట్టుకోటానికా? అధరామృతం గ్రోలలేని ఆ పెదవులెందుకు? సిగరెట్లు కాల్చటానికా? శృంగారం వలకబొయ్యలేని ఆ నోరు ఎందుకు? కాఫీ తాగటానికా?' పార్వతి మనసులో ప్రశ్నలు పరంపరగా వస్తాయి. ఒక్కోసారి ప్రాణం విసిగిపోయి 'మానూ, మాకునుగానూ, మామూలు మనిషిని నేను,' అని సినిమాపాట పాడాలన్నంత ఉక్రోషం వస్తుంది.

పార్వతికి మొదటినుంచీ కలలు కనటమంటే సరదా. బ్రతుకుని తనకలలమాదిరి మలుచుకోవాలని ఎంతగానో ఆశించింది. తన స్వశక్తితో జీవితాన్ని పాలపుంతంగా మార్చుకుందామని అనుకుంది. ఇప్పుడి ప్పుడే తెలిసివస్తోంది – 'జీవితం సుఖమయం చేసుకోవటానికి ఒకళ్ళు సరి పోరు, ఇద్దరు కావాలి' అని. ఆలోచిస్తున్నకొద్దీ ఎప్పటెప్పటి సంగతులో గుర్తుకు వస్తాయి. తన పెళ్ళి రాత్రిపూట అయింది. తెల్లవారుజామున మూడింటికి లగ్నం. పెళ్ళికి వచ్చిన వాళ్ళంతా నిద్రపోతున్నారు. తను

మంచంమీద కూర్చుని తీయని కలలుకంటోంది. అటూ ఇటూ తిరుగు తోంది. పెళ్ళివారికి విడిది పక్కఇంట్లోనే ఇచ్చారు

ప్రహరీగోడ అడ్డం. తను, ఆ వాకిలివైపు చాలాసార్లు వచ్చి చూసింది. కాబోయే భర్త కనబడనేలేదు. తను ఈ ఇంట్లో ఉంటున్న సంగతి తెలియదా? తనను చూడాలని ఉండదా! పార్వతి మనసు వ్యాకులపాటు చెందింది. దొడ్లోకివచ్చి నిలబడింది. ప్రహరీ గోడదాకా వచ్చి భావి పళ్ళెంలో నిలబడింది. భర్త కనిపించాడు. త్రుళ్ళిపడింది. సామానుల కొట్టంలో, చాపమీద, ఎడంచెయ్యి తలగడగా చేసుకుని గుర్రు పెడుతున్నాడు. అక్కడా పడుకునే చోటు? తనింటికి వస్తే పరుపూ, మంచం ఇచ్చేది. అయినా ఇప్పుడు నిద్రపోవట మేమిటి. తెల్లవారు జామున పెళ్ళి అని తెలియదా? నిద్రఎలా పట్టింది? పెళ్ళి అంటే అత నికి జీవితంలో మరువరాని అనుభూతిగా కనుపించటంలేదా! ఈ ప్రపంచ మంతా నవనవోన్మేషంగా, పూలపందిరిగా కనిపించటం లేదా? రోజూ చూసే పూలలో ఎన్ని కొత్త అందాలు కనిపించినాయి తనకు? ఎన్ని ఘుమఘుమలు వెదజల్లినాయి ఈ రోజు. రోజూ వేసుకునే తనజడ ఎన్ని కొత్త మెలికలు తిరిగింది. జడ ఎన్నిసార్లో విప్పి మళ్ళీ మళ్ళీ వేసుకుంటే గాని తనకు తృప్తి కలగలేదు. అట్లాంటిది తన కాబోయే భర్త గోపాలం అన్నీ మరిచి సుఖంగా నిద్రపోతున్నాడా? మెలకువలో సుఖం కొందరికీ, నిద్రలోసుఖం కొందరికీ, తా మిద్దరికీ ఇంత వైవిధ్యమా? తనెప్పుడయినా నిద్రపోతే మళ్ళీ వెంటనేలేచి ఈ ప్రపంచంలో ఉల్లాసంగా తిరగవచ్చుననే ఆకాంక్ష తొందర పెడుతూనే ఉండేది. కాని కొందరికి చేతిలో ఉన్న పనులు గబగబా పూర్తిచేసుకుంటే కాని హాయిగా నిద్రపోవచ్చునని ఉంటుంది. కాలకృత్యాలు, ఆకలి-నిద్రల్లోనే తీరే సదుపాయం ఏ శాస్త్రజ్ఞు

డన్నా చూపిస్తే వాళ్ళు అసలు నిద్రనించి లేవటానికే ఇష్టపడరేమో! పార్వతికి రకరకాల ఊహ లొచ్చినాయి. పెళ్ళి అయినరోజు ఉదయం గూడా ఇలాంటి పరిస్థితి వకటి తారసిల్లింది. తను ముఖం కడుక్కుంటూ సందులో పీటమీద కూర్చుంది. ఇంతలో అతను (ఆ మొగుడు) వచ్చాడు. తననుచూసి ఉలిక్కిపడ్డాడు. ఏదో తప్పుచేసిన వాడిలా వెనక్కు తిరిగాడు.

చేతిలో చెంబు - తాటాకు, కచ్చిక - బారిస్టరు పార్వతీశంలా వచ్చాడు. వచ్చి, పక్కనే మరొక పీటమీద కూర్చున్నాడు. రాత్రి పెళ్ళి అయిపోయె. తను ఇంక పరాయి స్త్రీ కాదాయె. ఏమన్నా పలకరిస్తాడేమో నని ఆశగా చూసింది. అతను మాట్లాడలేదు సరిగదా ఇటుపక్కకైనా తికిగి చూడలేదు. పార్వతి కొంచెం దగ్గింది. సందులోకి ఎవరూ రావటం లేదు. ఏ క్షణాన్నైనా ఎవరైనా రావచ్చు. ఏకాంతం భగ్నం కావచ్చు. పార్వతి ఆదుర్దాపడుతోంది. గోపాలం గుండె దడదడకు తరంగాలు బయలుదేరి పీట కదులుతున్న ట్లవుతోంది. అతను నోరువిప్పి వక్క మాటుగా వక్కప్రశ్న అడిగాడు.

'నువ్వు స్కూలు ఫైనలు ప్యాసయ్యావు గదూ!' భూమి బద్దలై నట్లు, తాను సంపూర్ణరామాయణం సినిమాలో సీతవేషం వేసుకుని భూమి లోకి దిగిపోతున్నట్లు అనిపించింది పార్వతికి. అదేం ప్రశ్న? ఇంకా 'సర్టిఫికేటు తెచ్చి చూపించు' అని అడగలేదు, నయం. ఉద్యోగంలో చేర్పిద్దా మనుకుంటున్నాడా? ట్రైనింగుకు పంపుదామనా? ప్రపంచములో ఎన్ని అందమైన విషయాలులేవు. భార్యాభర్తలుగా తొలి ఉదయం ప్రసంగంలో తేవలసిన విషయం ఇదొక్కటే కనిపించిందా? ఉదయకిరణాలు ఆకాశం అంతా పారాణి పూస్తున్నాయి. పూలన్నీ విచ్చి సుగంధాలు

వెదజల్లుతూ వింతవింత రంగుల్ని విదిలిస్తూ సీతాకోక చిలుకల్ని ఆహ్వా నిస్తున్నాయి. 'మనం ఇకనుండి ఆ సీతాకోక చిలుకల్లా ఆనందంగా విహ రిద్దాం' అనకూడదూ !

'నువ్వు పుష్పానివి. నేను తుమ్మెదను. నిన్ను వెతుక్కుంటూ వచ్చాను.'

'నువ్వు ఆకాశానివి. నేను సూర్యుణ్ని. నీ బుగ్గల్లో ప్రతిఫలించే అరుణరాగం నా కిరణాలే.'

నోరు తెరుస్తే ఎన్ని మంచిమాటలు రావచ్చును? కవితాధోరణి పద్యాలు రాసే వాళ్ళకేనా ఉండేది. ఏమీ చేతకాకపోతే 'నీ మొగుణ్ని – వచ్చాను,' అన్నా కొంత ఉపశమనం కలిగేదేమో! ఏ మాటాలేదు? అడిగిన ప్రశ్నకు సమాధానం కోసరం ఆగటమన్నా లేదు. ముఖంకడు క్కుని ముభావంగా వెళ్ళిపోయాడు. అదీ గజం దూరంగా వెళ్ళాడు. మాట్లాడటం చేతకాకపోతే వెళ్ళేటప్పుడు కనీసం బుగ్గ గిల్లిపోరాదా – ఎవరూ చూడటం లేదుగదా! పార్వతి చెంబెడునీళ్ళు ముఖాన కుమ్మరించు కుని వెళ్ళిపోయింది నిరుత్సాహంగా ఆరోజు.

...పార్వతి కాఫీ కలుపుతుంటే జరిగిన సంఘటనలన్నీ గుర్తుకు వస్తున్నాయి. తనెప్పుడూ దూదిపరుపుల్లాంటి మేఘాలమీద విహరించాలని అనుకుంటుంది. అత నెప్పుడూ నేలమీద ఉండాలనుకుంటాడు. పెళ్ళ యిన తర్వాత పరుపు కొనుక్కోవాలనిగూడా తెలియదు ఆ మనిషికి; 'ఏం మనిషి' అనుకుంది పార్వతి. కాఫీ కలిపి చేతికందిస్తూ గోపాలం కళ్ళల్లోకి సూటిగా చూసింది.

'సాయంకాలం ఇంటికి తొందరగా రండి.'

'ఏమిటి విశేషం?'

'విశేషం ఉంటేనేగాని రాగూడదా ?'

'అదిగాదు నా ఉద్దేశం.'

'మీ ఉద్దేశం ఏమిటో ఇంతవరకూ నాకూ అర్థం కానేలేదు. సాయంకాలం అలా పార్కుకు పోయి, అక్కడనుంచి ఏదన్నా సినిమాకు పోయివద్దాం.'

'సరే నీ ఇష్టం.'

'మళ్ళీ అదేమాట ! నా ఇష్టమంటారేమిటి - మీ ఇష్ట మేమిటో చెప్పండి. ఆ ప్రకారం చేద్దాం. నన్నుగూడా మీ ఆఫీసుకు రమ్మంటారా? లేకపోతే వేరే ఉద్యోగ మేదన్నా చూడండి.'

'నీతో ఏమన్నా కష్టమే - సాయంత్రము పెందరాళే వచ్చేస్తాను. సరేనా ?'

గోపాలం నాలుగు గంటలకే వచ్చాడు. హోటలుకు పోయి కాఫీ తాగి, అక్కడనుండి పార్కుకు పోదామంది పార్వతి. హోటలులో జనం రద్దీ ఎక్కువగా ఉన్నది. ఏకమూలగా పోయి కూర్చున్నారు. సర్వరు వచ్చాడు.

'ఏం కావాలి, సార్ ?'

'ఏం ఉన్నాయి.' హోటళ్ళు వెలిసినప్పటినుండీ వస్తున్న ప్రశ్న.

'ఇడ్లీ, గారె, ఉప్మా, పెసరట్.' అతను బీరువావంక చూస్తూ వల్లెవేస్తున్నాడు.

'ఏం కావాలి ? చెప్పు,' పార్వతిని అడిగాడు గోపాలం.

'నాకేం వద్దు. మంచినీళ్ళు తాగిపోదామని వచ్చాను...' రుసరుసలాడింది పార్వతి.

'మంచినీళ్లు ఇంటిదగ్గరే ఉన్నాయిగా.' గోపాలం చిరాకు పడ్డాడు.

'ఇవ్వాళ పంపులు కట్టేశారుట. మనం హోటలు కెళుతున్నామని వాళ్ళకికూడా తెలిసినట్లుంది.'

సర్వర్ ఈ హడావుడిలో వెళ్ళిపోయాడు.

'మనిద్దరం చర్చలో పడితే ఇట్లాగే అవుతుంది.'

'ఎందుకువచ్చిన చర్చ. మీరు ఆఫీసుకుపోయి ఫైళ్ళను కావలించుకుని కూర్చోండి... నేను ఇంటికిపోయి దుప్పటి కప్పుకుని పడుకుంటాను. ఎవరికీ బాధ వుండదు.'

'సరే అయితే పద.' గోపాలం సర్రునలేచాడు. హోటలు గుమ్మం దాటుతూనే 'మనం ఇట్లా పోట్లాడుకోవటం ఏం బాగాలేదు. సరదాకని బయలుదేరిన దానివి, ఏం కావాలో చెప్పరాదా.'

'ఆకలయి టిఫిన్లు మెక్కుదామని రాలేదు నేను. ఆకలేస్తే ఇంటి దగ్గర కమ్మగా చేసుకుని తినేదాన్ని.'

'అది అందరకూ మంచిది — ఇంటికీ, వంటికీ.'

'బుద్ధి వచ్చింది లెండి. బజారుకు పోదామని ఇంకెప్పుడూ అడగను లెండి. చెంపలు వాయించుకో మంటారా. ఇక్కడ బాగుండదంటే ఇంటికెళ్లి వాయించుకుంటాను.' పార్వతి కళ్ళల్లో నీళ్ళు తిరిగినాయి.

పార్వతి ఆలోచన లేమిటో గోపాలానికి అర్థంకావు. నవ్వుతూ మాట్లాడుతూనే శివమెత్తినట్లు మాట్లాడుతుంది మరు క్షణంలో. ఆ అంద మైన కళ్ళు ఎప్పుడు ఏ భావం చూపిస్తాయో గోపాలానికి అంతు పట్టటం లేదు.

'ఏయ్ రిక్షా!' గోపాలం రిక్షావాడిని పిలిచాడు.

'రిక్షా ఎందుకు... నడిచిపోతే సరిపోతుంది... మనిద్దరం నడిచిపో తుంటే ఎవరన్నా ఏమన్నా అనుకుంటారని భయమా మీకు?'

'నా కెందుకు భయిం?'

'ఏమోలెండి. కాపరానికి వచ్చిన మూడోరోజే అన్నారు మీ అమ్మ గారు.'

'ఏమన్నారు?'

'మనద్దరం ఎకసెక్కాలాడుతూ మాట్లాడుకోవటం బాగాలేదుట. రెండుజడలు వేసుకోవటం, నైలాను చీరె కట్టికోవటం-ఇవేవీ బాగుండవట. 'ఈ వేషాలు మా అబ్బాయికిగూడా నచ్చవు' అని చెప్పారులెండి. ఇంకా నయం 'మొగుడూ పెళ్ళాల్లాగా అలా పూసుకుని తిరగట మేమిటి అస హ్యంగా!' అనలేదు. అప్పటికే అదృష్టవంతురాలిని. మీతో కలిసి ఉండటానికి వచ్చానా? అంట్లు తోమటానికి వచ్చానా? ఈ ఇంట్లో నా హోదా ఏమిటో అర్థం కావటంలేదు. నే నెవరినో అర్థం కావటంలేదు.' పార్వతి కళ్ళల్లో నీళ్ళు తిరిగినాయి. చెక్కిళ్ళవెంబడి నీటిచుక్కలు జారి పమిటమీద పడుతున్నాయి. 'పోదాం పదండి, ఇంటికి. రిక్షా పిలవండి. రిక్షాపైన ముసుగుకూడా వేయించండి. మనిద్దరం అలా దగ్గిర దగ్గిరగా కూర్చుని రిక్షాలో పోతుంటే అసహ్యంగా ఉంటుందేమో.' పార్వతి కొంగుతో కళ్ళు తుడుచుకుని ఈ పాపిష్టి దేవుడు అందరినీ మొగవాళ్ళ గానే సృష్టిస్తే సరిపోయేది. ఈ ఆడవాళ్ళని సృష్టించటం దేనికో? ఏడి పించటానికా!' అంది.

గోపాలం నివ్వెరపోయాడు. పార్వతితో ఏం మాట్లాడటానికీ తోచ లేదు. గొంతు పెగల్లేదు. ముభావంగా పక్కనే అడుగులువేస్తూ వచ్చాడు. పార్వతి రిక్షా పిలిచింది. ఇల్లు గుర్తుచెప్పింది. గోపాలం రిక్షాలోకిచేరాడు.

'ఏమిటీ మాటలు పార్వతీ? నన్ను అర్థం చేసుకుంది ఇంతవరకేనా. ఆఫీసునుంచి పెందలాడే వచ్చింది ఈ రకంగా గడపటానికేనా,' అన్నాడు పార్వతి నడుంమీద చేయివేస్తూ. ఆ మాత్రానికే పార్వతికి ప్రాణం లేచివచ్చినట్లయింది. అతనిమీదకు వంగి మిగిలిన కన్నీళ్ళన్నీ కార్చేసింది.

మర్నాడు తెల్లవారుతూనే 'ఈ చీకట్లో పోయి మీరు పాలకోసం గిన్నె పట్టుకుని ఆ చలిలో నిలబడక్కరలేదు. ఇవ్వాల్టినుంచీ కాఫీమానేద్దాం,' అంది పార్వతి.

'కాఫీ మానేస్తే సరిపోయిందా, పెరుగుకి కావద్దూ.'

'పెరుగుకూడా మానేద్దాం.'

'ఆఫీసు మానేసి అన్నంగూడా మానేద్దాం. ఎప్పుడూ ఒకళ్ళను చూసుకుంటూ ఒకళ్ళు కూర్చోవచ్చు.'

'నేను సిద్ధమే దానికి,' అంది పార్వతి.

కోపం సడలిపోయి నవ్వు వచ్చింది.

'పోనీలెండి. నేను పోయి పాలు తీసుకువస్తాను. మీ రిక్కడే ఉండండి. అయిదు నిమిషాల్లో వచ్చేస్తాను.'

'అక్కడకుపోయి అచ్చమ్మలతో, పిచ్చమ్మలతో కబుర్లుపెట్టుకుని కూర్చునేవు.'

'నేను తొందరగా వచ్చెయ్యాలని కలిగిందికదా...' పార్వతి గిన్నె తీసుకుని వెళ్ళిపోయింది. అప్పటికే చాలా మంది వచ్చి లైనులో నిలబడ్డారు పాల కారుకోసం జనం ఎదురుచూస్తున్నారు — గంగా భవాని కోసం భగీరథుడిలా.

'ఏం వదినగారూ ! పాలకోసం ఇవ్వాళ మీ రొచ్చారు ?' అంది అచ్చమ్మ.

'ఏం ? మావారికోసం ఎదురుచూస్తున్నారా మీరు ?' అందామను కుంది పార్వతి. ఎందుకులే అని మాట్లాడకుండా నిలబడింది. అచ్చమ్మ ప్రాణం ఆగటంలేదు. ఏదో రకంగా పార్వతిని సంభాషణలోకి దింపా లనుకుంది.

'మీ అత్తగారు కనిపించటంలేదు ఈ మధ్య ?' అంది అచ్చమ్మ మళ్ళీ.

పార్వతికి కొంచెం ధైర్యం వచ్చింది.

'మా అత్తగారు మామగారి దగ్గరకు పోయారు,' అంది పార్వతి. అంతా గొల్లుమన్నారు. అచ్చమ్మ చిన్నబోయింది. పిచ్చమ్మవైపు తిరి గింది. ఏదో గుసగుసలు మొదలుపెట్టింది. ఇద్దరూ లోపల లోపల నవ్వుకుంటున్నారు. పార్వతికి అనుమానంగా ఉన్నది - తన గురించి ఏదో చెప్పుకున్నారని. అయినా వాళ్ళతో తన కేం పని ? నిర్లక్ష్యంగా నిలబడింది.

'పిచ్చమ్మొదినా ! ఈ సంగతి విన్నావా ?.

'అచ్చమ్మ ఏదన్నా కొత్తవిషయం తెస్తుందని అందరికీ తెలుసు. ఎవరి మొగుడు ఎట్లాంటివాడో, ఎవరి పెళ్ళాం ఎట్లాంటిదో, వాళ్ళు రహ స్యంగా ఏమేమి మాట్లాడుకుంటారో అన్నీ చెప్పెయ్యగలదు. అందు కనే అందరికీ ఆత్రం.

'ఏ సంగతి ?' పిచ్చమ్మ ఉవాచ.

'అదే మొన్న చిక్కడపల్లిలో జరిగిన సంగతి.'

'నా కేం తెలుసు. అయినా, ఎవరి సంగతి ?'

'అదేనమ్మా. ఆవిడ పేరు - సమయానికి పేరు గుర్తురావటం లేదు.'

'పేరు ఏదయితే నేం లే. జరిగిం దేమిటి.'

ఆ...ఏంలేదు. మొగుడు పాలకోసమని తెల్లవారకట్ల నాలుగింటికే పాల కేంద్రానికి వచ్చి కూర్చున్నాడుట. ఇంతలోకి ఎవరో దొంగాడొచ్చాడుట... ఇంట్లో ఎవరూ లేరని చూసి పక్కలోవచ్చి పడుకున్నాడుటమ్మా వదినా !'

'మరీ చోద్యం. ఆవిడెట్లా ఊరుకుంది. కేకలు పెట్టలేదా.'

'అయ్యోరాత ! చెప్పొచ్చిందేమిటి ? అసలే నిద్రమత్తుకాదూ. మొగుడని ఊరుకుందిట.' అంతా సంభ్రమాశ్చర్యాలు ప్రకటించారు. పార్వతి వినిగూడా విననట్లు ఊరుకుంది. పిచ్చమ్మ మాత్రం కళ్ళుపెద్దవి చేసుకుని విన్నది. ఏదో బెంగపడ్డట్లుగా నిట్టూర్చింది.

'ఈ దొంగలు అన్నిచోట్లా తిరుగుతున్నారుట,' అంది పిచ్చమ్మ భయపడుతున్నట్లు. కాని అ స్వరంలో 'ఆ దొంగాడు మనింటికి ఎందుకు వస్తాడు,' అని నిస్పృహ చెందుతున్నట్లుగా తోచింది పార్వతికి. అక్కడ ఇంకా ఎక్కువసేపు నిలబడలేకపోయింది. వచ్చెయ్యటానికి బుద్ధిపుట్ట లేదు. పాలు రాకపోతే ఎట్లా. గోపాలం కాఫీ త్రాగకపోతే ఒకక్షణం ఉండలేడు. ఇంతలోకి పాలకారు రానేవచ్చింది. ఉన్న లైను క్షణంలో చెదిరిపోయింది. శరీరాలు వెనక్కు వెళ్ళిపోయి చేతులు, గిన్నెలు ఒక చోటికే వచ్చినాయి. పాలకార్డులు చూపించటం, పాలు పోయించుకోవటం అంతా గందరగోళంగా ఉంది. బీదలకు అన్నదానం చేస్తేకూడా ఇంత

గడబిడ ఉండదేమో? జనసందోహంనుండి బయట పడేటప్పటికి మరొక జీవి ఈ లోకంలోకి వచ్చినంత పనయింది. పార్వతి గబ గబా అడుగులు వేసుకుంటూ బట్టసర్దుకుని యింటికి వచ్చేసింది. గోపాలం మంచంమీద బాసిపట్టు వేసుకుని కూర్చున్నాడు. పార్వతిని చూడగానే గబుక్కున లేచివచ్చాడు. తలుపు దగ్గరకువేసి పాలగిన్నె డ్రాయరుమీద పెట్టి పార్వతిని గుండెలకు హత్తుకున్నాడు. 'ఏమిటి ఈ మార్పు' అని పార్వతి విస్తుపోయింది.

'మీకో తమాషా చెబుతాను,' అంది పార్వతి.

'నేనూ ఒక తమాషా చెబుదామనుకుంటున్నాను,' అన్నాడు గోపాలం.

'ముందు నా తమాషా వినండి. చిక్కడపల్లిలో ఒకదొంగాడు...'

పార్వతి మాటను మధ్యలోనే ఆపేశాడు. 'నువ్వు విన్న సంగతి చెబుతున్నావు. నేను జరిగిన సంగతి చెబుతున్నాను విను.'

'సరే మీరే చెప్పండి.'

'నువ్వు పాలకోసం అని వెళ్ళావా? నేను గదితలుపు వేసుకోవటం మరచి పడుకున్నాను. ఇంతలోకి పనిమనిషి వచ్చింది. తలుపు తట్టింది - నువ్వే అనుకొన్నా. కొంచెం బెట్టుచేద్దామని ముఖం అంతా దుప్పటి కప్పుకుని పడుకున్నాను. 'పనిమనిషి వచ్చి నువ్వు పడుకున్నావనుకుని బలవంతాన దుప్పటి లాగేసింది.'

పార్వతి ఫక్కుమని నవ్వింది.

'నయం... మెల్లిగావచ్చి పక్కలో పడుకోలేదు.' పార్వతి ఇంకా నవ్వుతూనే వున్నది. గుమ్మం ఊడుస్తున్న పని మనిషి వీళ్ళ నవ్వులు విని దొడ్లోకి వెళ్ళిపోయింది.

'మరి నువ్వు చెప్పబోయే తమాషా ఏమిటి?'

'ఊరికేనే అన్నాను. ఏం లేదు లెండి. రేపటినుంచీ కాఫీ ఐనా మానేద్దాం. లేకుంటే పాల కేంద్రానికి ఇద్దరం తలొక గిన్నె తీసుకుని పోయి అక్కడే కూర్చుందాం' అంది పార్వతి.

(యువ 1967)

—o—